# బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

- నల్లగొండ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం
- సభా ప్రాంగణంతో పాటు హైవేపై పెద్ద సంఖ్యలో జన సందోహం
- సీఎం స్పీచ్‌కు పలుమార్లు చెయ్యెత్తి మద్దతు తెలిపిన ప్రజలు



నల్లగొండ: సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు ఉమామాధవరెడ్డి, పాల్వాయి స్రవంతి

నల్లగొండ, నవంబర్ 20 : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండలో సోమవారం నిర్వహించిన ప్రజాశీర్వాద సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. నల్లగొండతో పాటు మండలం, తిప్పర్తి, కనగల్, మాడ్గులపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఈ సభకు తరలి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి జనసమీకరణ చేయగా అంచనాలకు మించి జనం హాజరయ్యారు. వివిధ మండలాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు రైల్వే ట్రాక్ నుంచి మర్రిగూడ బైపాస్ వరకు భారీ ర్యాలీగా వచ్చారు. పానగల్ పై ఓవర్ నుంచి –చర్లపల్లి నుంచి సభా ప్రాంగణం వరకు హైవేపై పెద్ద సంఖ్యలో జన సందోహంతో సభా ప్రాంగణం అంతా కిటకిటలాడింది.

### సీఎం కేసీఆర్ స్పీచ్‌తో జోష్‌తో జేజేలు..

సీఎం కేసీఆర్ సభా ప్రాంగణంపైకి వచ్చి అందరికీ అభివాదం చేసిన తర్వాత ఆయన మాట్లాడుతున్న సమయంలో ప్రజలు జేజేలు పలుకుతూ మద్దతు తెలిపారు. కాంగ్రెసోళ్లు అన్నట్లు మూడు గంటల కరెంట్ కావాలా..24 గంటల కరెంట్ కావాలా అన్నప్పుడు మూడు గంటలు చాలదు 24 గంటలే కావాలి అని ప్రజలు నినదిస్తూ చెప్పారు. నల్లగొండ గత ఎన్నికల్లో దత్తత తీసుకొని రూ.1,400 కోట్లతో అభివృద్ధి చేస్తున్న అయితే ఇంకా నల్లగొండ దత్తత అయిపోలేదు..నా దత్తతలోనే ఈ నల్లగొండ ఉన్నది..దీన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని అన్నప్పుడు కేరింతలతో సంఘీభావం తెలిపారు.

### బోర్ల రామిరెడ్డిని ఆలింగనం చేసుకున్న సీఎం కేసీఆర్..

బోర్ల రామిరెడ్డి.. సమైక్యాంధ్రలో తనకున్న పదెకరాల భూమిలో ఎన్ని బోర్లు వేసినా చుక్క నీరు పడకపోవడంతో బైరెడ్డి రాంరెడ్డి కాస్త బోర్ల రామిరెడ్డిగా మారాడు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభలో సైతం ప్రస్తావించారు. నాడు బోర్ల రామిరెడ్డి 54 బోర్లు వేసినా ఒక చుక్క నీరు కూడా రాలేదు. కానీ నేడు నల్లగొండలో ఎక్కడ చూసినా నీళ్లే కనిపిస్తున్నాయన్నారు. నేడు వరి సాగు జోరుగా అవుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ స్పీచ్ అనంతరం బోర్ల రామిరెడ్డి వేదికపైకి రావడంతో ఆయనను ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సభా ప్రాంగణంలో తుంగతుర్తికి చెందిన కళాకారుడు సందీప్ ఆధ్వర్యంలో తెలంగాణ పాటలు పాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్టీపీ భువనగిరి పార్లమెంట్ అధ్యక్షుడు ఇరిగి సునీల్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు సీఎం కేసీఆర్ గులాబీ కం డువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి, నిరంజన్ వలీ, చకిలం అనిల్ కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, యూసఫ్ జావెద్, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి, కోటి రెడ్డి, యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఉమామాధవ రెడ్డి, పాల్వాయి స్రవంతి, దొంతు రామ్మోహన్, వెంకటేశ్వర్లు, బొర్ర సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్‌తో పాటు కౌన్సిలర్లు, నల్లగొండ, తిప్పర్తి, కనగల్, మాడుగుల పల్లి మండల పార్టీల అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజా ఆశీర్వాద సభకు ఆశేష జనవాహిని

నల్లగొండ సిటీ : నల్లగొండలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు ఆధికసంఖ్యలో తరలివచ్చారు. దాంతో సభ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా గులాబీ జెండాలు కళకళలాడాయి. సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తుండగా ఈలలు, కేరింతలతో స భా వేదిక దద్దరిల్లింది.





ప్రజా ఆశీర్వాద సభలో యూత్ జోష్





సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు బాల కృష్ణన్, పక్కన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ, నవంబర్ 20: రాష్ట్ర శాసన సభకు జరుగనున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు బీఆర్ బాల కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో సోమవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీ జిల్లాకు కేటాయించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఎన్నికల వ్యయ నమోదు బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌కంటాక్స్, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్, ఎల్‌డీఎం, ఎక్సైజ్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వ్యయ పరిశీలన, నమోదు ముఖ్యమైన అంశమని, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, సర్వే లైన్స్ టీమ్‌లు, పోలీస్ బృందాలు అంకిత భావంతో పని చేయాలని అన్నారు. డబ్బు నిల్వ చేసే ప్రాంతాలపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధానాలు, విధుల ఏర్పాట్లపై వివరిస్తూ ఎన్నికల ప్రక్రియ విధానంలో ప్రభుత్వ ఉద్యోగుల విధులు చాలా ముఖ్యమైనవన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వ్యయ పరిశీలనకు పని చేస్తున్న వారు ఆయా శాఖలు వారీగా ఎన్నికలలో పనితీరు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ జిల్లా లో ఎన్నికల నియమావళి అమలు వచ్చిన తర్వాత పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా పోలీస్, ఎఫ్ఎస్‌టీ బృందాలు పట్టుకున్న నగదు, బంగారం, వెండి ఇతర వస్తువులకు సంబంధించి ఇప్పటి వరకు 244 కేసులకు సంబంధించి అప్పీళ్లను పరిశీలన చేసి క్లియర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో సీ విజిల్ ద్వారా 419 ఎన్నికల ఉల్లంఘన ఫిర్యాదులు రాగా 320 పిర్యాదులు పరిశీలించి 100 నిమిషాల్లో పరిష్కరించినట్లు తెలిపారు. 99 ఫిర్యాదులు పరిశీలించి అర్‌ఓలు, ఏఅర్‌ఓలు డ్రాప్ చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీశ్ గురుమూర్తి, డీఎం నిమ్జే, సంతోష్ కుమార్, ఎస్పీ అపూర్వరావు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం

నల్లగొండ రూరల్ 80 ఏండ్ల పైబడిన వారికి, కదల్లేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా ఇంటి వద్దనే (హోం ఓటింగ్ సౌకర్యం) కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్.వీ .కర్ణన్ తెలిపారు. నల్లగొండ పెద్దబండలో హోమ్ ఓటింగ్‌ను నిర్వహిస్తున్న విధానాన్ని, పోస్టల్ బ్యాలెట్ , వారి పేర్లు, గుర్తులను పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. అంతకు ముందు కనగల్ మండలం ఎస్.లింగోటంలో దివ్యాంగుడికి మట్టపల్లి వెంకటరమణ ఇంటి వద్ద ఓటు వేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట నల్లగొండ రిటర్నింగ్ అధికారి రవి ఉన్నారు.

## ‘ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి’

నల్లగొండ రూరల్, నవంబర్ 20: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు ,రాష్ట్ర సివిల్ సప్లయ్ టాస్క్ ఫోర్స్ టీం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని దండంపల్లిలో ఎఫ్‌పీఓ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఇప్పటి వరకు 35,195 రైతుల వద్ద నుంచి 2,37,337 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రూ. 373 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వారి వెంట డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్ఐ లింగస్వామి ఉన్నారు.

### ఎన్‌జీ కళాశాలలో ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

రామగిరి, నవంబర్ 20 : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సోమవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికివిద్యావేత్త ఎంవీ గోనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఆ కళాశాల గ్రంథాలయ అధ్యాపకుడు డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ మునీరొద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

తిప్పర్తి, నవంబర్ 20 : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు,బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. సిలార్‌మి యాగూడెం నుంచి సర్పంచ్ యర్రమాద కవితానరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.



కనగల్ మండలం నుంచి తరలివస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### కనగల్ మండలం నుంచి

నల్లగొండ సిటీ : కనగల్ మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కనగల్, రేగట్టె, పగిడిమర్రి, పర్వతగిరి, దోరేపల్లి, తుర్కపల్లి, బుడమర్లపల్లి,తేలకంటిగూడెం,బచ్చనగూడెం, ఎం.గౌరారం, అచ్చుగూడెం, ఇరుగంటిపల్లి, అమ్మగూడెం, తిమ్మనగూడెం, బోయినపల్లి, మార్తినేనిగూడెం శాబ్దులాపురం గ్రామాల నుంచి 15 వేల మందికి పైగా కార్యకర్తలు సభకు తరలివచ్చారు.

### హోరాహోరీగా ఎంజీయూలో ఐటీసీ క్రీడలు

రామగిరి, నవంబర్ 20: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్సిటీ

ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్(ఐటీసీ)క్రీడా పోటీలు యోగా, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్ సోమవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తలపడగా ప్రతిభ చూపిన వారిని వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. విద్యార్థులు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్అల్వాల రవి, పాలక మండలి సభ్యులు డాక్టర్ ఆకుల రవి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వై. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, వివిధ కళాశాలల పీడీలు , విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింట్ ఈద కిరణ్, తండ్రి చంద్రయ్య, వయస్సు:33 సం॥ వృత్తి, ప్రైవేట్ ఎంప్లాయ్, నివాసం ఇ.నెం.సి-83, లక్ష్మిదేవిగూడెం గ్రామం, మునుగోడు మండలం, నల్లగొండ జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఇంటి యొక్క ఒరిజినల్ దస్తావేజు నం.10775/2021, నేను కొనుగోలు చేసినటువంటి ఇల్లు దాని యొక్క లింకు దస్తావేజు నం.6608/2002, Dated: 17-10-2002, SRO-Nalgonda ద్వారా సంక్రమించినది. ఇట్టి లింకు దస్తావేజు పానగల్ నుండి క్లాక్ టవర్‌కు బైక్ పై వెలుచుండగా మార్గమధ్యములో పోయినది ఇట్టి విషయమై నల్లగొండ II Town పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్థి యొక్క వివరములు ఇంటి నం.1-5-401, (LIG H.No.348), సర్వే నం.734, 735, 737 & 781 విస్తీర్ణం 133.33 sq.yards=111.48 Sq.mtrs., ఏ.పి.హౌసింగ్ బోర్డు కాలనీ, మామిల్లగూడా ఏరియా, నల్లగొండ టౌన్ & జిల్లా సదరు ఆస్థి యొక్క హద్దులు: ఉత్తరం: H.No.347/LIG-1, దక్షిణం: H.No.349/LIG-1 తూర్పు:33.00 వైడ్ రోడ్డు, పడమర:H.No.341/LIG-1 ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంత్రములున్నచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- **నాంపల్లి చంద్రశేఖర్**
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేది:20-11-2023